www.vishalabharati.com
epaper:vishalabharati.com

TELANGANA POLITRICKS

పొలిట్రిక్స్
2023-2024

విశాల భారతి
vishalabharathi Telugu Daily
మంగళవారం, 05.09.2023
హైదరాబాద్
1.00 pm edition





పొలిట్రిక్స్



# జై.. 'భీం'!

## చేవెళ్ల కాంగ్రెస్ నుంచి 'భీం భారత్'కే అవకాశం
## అన్ని సర్వేల్లోనూ ఆయన పేరే ముందంజ
## ఇప్పటికే ఏఐసీసీకి చేరిన అభ్యర్థుల జాబితా
## బీఫాం కన్ఫార్మ్ అంటున్న గాంధీ భవన్ వర్గాలు
## 'భీం' కు కలిసివస్తున్న విప్లవోద్యమ నేపథ్యం

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో ప్రతినిధి :**
చేవెళ్ల కాంగ్రెస్ టికెట్ పంచాయితీ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. టీపీసీసీ ప్రచార కమిటీ మెంబర్ 'పామెన భీం భారత్' వైపే హైకమాండ్ మొగ్గు చూపినట్లు సమాచారం. విప్లవోద్యమ నేపథ్యం నుంచి వచ్చిన ఆయనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో గట్టి పట్టు ఉండడమే కాకుండా..నియోజకవర్గం లోని రెడ్లతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. యూత్‌లోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ నిర్వహించిన సర్వేల్లోనూ ఆయన పేరే ముందంజలో ఉంది. అంతేగాక గత ఎన్నికల్లోనే ఆయనకు టికెట్ ఇస్తామని కాంగ్రెస్‌హైకమాండ్ హామీ ఇచ్చినా.. అప్పట్లో ఓ రాష్ట్ర స్థాయి నేత వ్యతిరేకించడంతో చివరి నిమిషంలో చేజారింది. ఈ అంశాలన్నీ పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర కమిటీ 'భీం' అభ్యర్థిత్వానికే జై కొట్టినట్లు సీనియర్లు చెబుతున్నారు. ఈ మేరకు ఏఐసీసీకి పంపిన లిస్ట్‌లో భీం భారత్ పేరు మొదటి వరుసలో ఉన్నట్లు గాంధీభవన్‌వర్గాల ద్వారా తెలిసింది.

**1995లోనే రాజకీయాల్లోకి..**
భీం భారత్ 1995లో రాజకీయాల్లోకి వచ్చారు.



సీసీఐ పార్టీ నుంచి శాబాద్ జడ్పీటీసీగా పోటీ చేసిన ఆయనను అప్పట్లో టీడీపీ అభ్యర్థి, ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కీలక పదవిలో ఉన్న లీడర్ వర్గీయులు కిడ్నాప్ చేశారు. అభ్యర్థిని కిడ్నాప్ చేయడంతో అధికారులు ఎన్నికను రద్దు చేసి మళ్లీ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బరిలో నిలిచిన భారత్ ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకపోయినా బలమైన రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి చేతిలో కేవలం 2 వేల ఓట్లతో ఓటమి పాలయ్యారు. తర్వాత 1999 వరకు సీపీఐలోనే కొనసాగారు. ఇదే ఇయర్‌లో నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. కాగా, శాబాద్ ప్రాంతంలో ఓ వర్గం దౌర్జన్యాలకు పెరిగిపోవడం, ప్రశ్నించిన ప్రజా సంఘాల నేతలు హత్యకు గురికావడం లాంటి ఘటనలు భరించలేని ఆయన మావోయిస్టుల బాటను ఎంచుకున్నారు.

**గత ఎన్నికల్లో చేజారిన టికెట్**
వాస్తవానికి భీం భారత్‌కు గత అసెంబ్లీ ఎన్నికల్లోనే టికెట్ రావాల్సి ఉంది. ఈ మేరకు ఢిల్లీలోని వార్ రూమ్‌లో మూడు దశల్లో ఇంటర్వ్యూ కూడా చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు ప్రకటించిన హైకమాండ్ కేవలం చేవెళ్ల అభ్యర్థిని మాత్రం హోల్డ్‌లో పెట్టింది. తర్వాత ఏం జరిగిందో ఏమో గాని, మాజీ ఎమ్మెల్యే రత్నంకు టికెట్ ప్రకటించారు. అయితే అప్పట్లో జిల్లా మంత్రిగా ఉన్న ఓ నేత 'భీం' అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారని ప్రచారం జరిగింది. భీం ముందు నుంచి వారి కుటుంబాలకు వ్యతిరేకంగా పేదల పక్షాన పోరాటాలు చేస్తుండడం ఇందుకు కారణమని అప్పట్లో మీడియా కూడా కోడై కూసింది. భారత్‌పై అక్రమ కేసులు పెట్టించి పీడీ యాక్టు నమోదు చేయించింది కూడా వాళ్లేనని ఆరోపణలు ఉన్నాయి. అయితే పీడీయాక్ట్ బోర్డు భారత్‌పై పెట్టిన కేసులు అక్రమమని గుర్తించడంతో కోర్టు క్లీన్ చీట్ ఇచ్చింది.

> ఆయన గురించి పెద్దగా ఎవరికీ తెలియదు.. 28 ఏళ్ల కిందనే రాజకీయాల్లోకి వచ్చినా.. 20 ఏళ్ల పాటు విప్లవోద్యమ నేతగా పనిచేసినా.. ఆయనపై మీడియా ఫోకస్ చేయలేదు. ఐదేళ్ల కింద మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చినా స్థాయికి తగిన ఆదరణ రాలేదు. ఆయన కూడా ఏనాడూ వ్యక్తిగత ప్రచారం కోసం వెంపర్లాడలేదు. కానీ ప్రజా సమస్యలు, అందులోనూ పేదవాళ్లు ఉంటే మాత్రం అక్కడ వాలిపోతారు. వారి కోసం ఎంత వరకైనా వెళ్లి పోరాటం చేస్తారు. ఆయనే కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత, టీపీసీసీ ప్రచార కమిటీ మెంబర్ భీం భారత్.. దశాబ్దాలుగా చేవెళ్ల నుంచి ఒకే కుటుంబం అధికారం చెలాయిస్తోందని, కానీ అభివృద్ధి మాత్రం జరగడం లేదని చెప్తున్నారాయన.. రాజకీయాల్లో మార్పు కోసమే తాను విప్లవోద్యమాన్ని వదిలి వచ్చానని, నియోజకవర్గంలో మార్పు తెచ్చేవరకు పోరాటం ఆగదని చెప్తున్నారు. ఒక్కసారి అవకాశమిస్తే మార్పు చేసి చూపిస్తానంటున్నారు.

**పేద కుటుంబం నుంచి..**
భీం భారత్ స్వగ్రామం రంగారెడ్డి జిల్లా శాబాద్ మండలం నరెడ్ల గూడ. మావోయిస్టు ఉద్యమాల్లోకి వెళ్లిన తర్వాత భీం భారత్‌గా మారింది.పేద కుటుంబం, దళిత వర్గాల నుంచి వచ్చిన ఈయన చిన్నప్పటి నుంచే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. అన్నింటికి చదువే పరిష్కారమన్న అంబేద్కర్ భావజాలానికి ఆకర్షితుడై ఆ దిశగా ముందుకు సాగారు. ప్రైమరీ విద్య అంత హాస్టల్ లో ఉంటూ ప్రభుత్వ బడిలోనే చదువుకున్నారు. ప్రభుత్వ కాలేజీలోనే ఇంటర్ , నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. తర్వాత ఎల్ఎల్‌బీలో జాయిన్ అయినా అప్పటికే ప్రజా ఉద్యమాల్లో రావడంతో మధ్యలోనే వదిలేశారు. ఆయన జనశక్తి నేతగా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ప్రభుత్వ భూముల పంపిణీలో కీలకంగా వ్యవహరించారు. కులవివక్షపై పోరాటం చేసి అనేక చోట్ల దళితులకు ఆలయాల్లోకి ప్రవేశం కల్పించారు.

**ఎస్సీ, ఎస్టీ, డిక్లరేషన్ సభ సక్సెస్‌లో కీలక పాత్ర**
ఇటీవల చేవెళ్లలో నిర్వహించిన కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభ సక్సెస్ కావడంలో భీం భారత్ కీలకంగా పనిచేశారు. జన సమీకరణ చేయడంతో పాటు సభ నిర్వహణ బాధ్యతలు చూసిన వారిలోనూ ఆయన ఒకరిగా ఉన్నారు. సభకు ఊహించిన దానికంటే ఎక్కువ జనాలు రావడంపై, డిక్లరేషన్‌లోనూ 12 అంశాలపై అదే స్థాయిలో స్పందన రావడంతో పార్టీ పెద్దలు లోకల్ నాయకత్వాన్ని అభినందించారు. అంతేకాదు ఏఐసీసీ, టీపీసీసీ నుంచి ఏ పిలుపు వచ్చినా భీం క్యాడర్‌ను ముందుండి నడిపిస్తున్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఎక్కడ మీటింగ్ పెట్టినా, నిరసన తెలిపినా వేల సంఖ్యలో క్యాడర్‌ను తీసుకెళ్తున్నారు. ఈ అంశాలతో పాటు ఆయన విద్యావంతుడు కావడంతో చేవెళ్ల బరిలో భీం నిలబడితేనే పార్టీకి, ప్రజలకు మేలు జరుగుతుందని హైకమాండ్ భావిస్తున్నట్లు తెలిస్తోంది.


### 20 ఏళ్ల పాటు జనశక్తి నేతగా..

1999లో ఎంపీ ఎన్నికల తర్వాత భీం భారత్ సీపీఐఎంఎల్ జనశక్తి పార్టీలో చేరిపోయారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పార్టీ నిర్మాణ బాధ్యతలు తీసుకొని ఎంటర్ అయిన ఆయన వివిధ దళాల్లో, వివిధ హోదాల్లో పనిచేసి రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగారు. అనేక విప్లవోద్యమ కార్యకలాపాల్లో పాలు పంచుకున్నారు. ఎన్నో ఎన్‌కౌంటర్లను ఎదుర్కొన్నారు. నాటి ప్రభుత్వాలు సాగించిన ఎన్‌కౌంటర్లలో ఎందరో సహచర కామ్రేడ్లను కోల్పోయారు. ఆ తర్వాత చాలామంది మావోయిస్టులు పుట్టకొకరు, గుట్టకొకరు అన్నట్లు చెల్లాచెదురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనూ ఆయన చందాలు వసూలు చేసి వారిని, వారి కుటుంబాలను ఆదుకునే ప్రయత్నం చేశారు. 2018లో ఆరోగ్య సమస్యలు, ఇతర కారణాలతో జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. బయటికి వచ్చిన తర్వాత సెక్యులర్‌గా ఉండే కాంగ్రెస్ పార్టీని ఎంచుకొని పనిచేయడం ప్రారంభించారు. అనతి కాలంలో అధికార ప్రతినిధి పదవి పొందారు. దీంతో అనేక గ్రామాల్లో మీటింగ్‌లు పెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. పలు గ్రామాల్లో అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాలు ఏర్పాటు చేయించి.. బడుగు, బలహీన వర్గాలను ఏకం చేసేందుకు ప్రయత్నించారు.



## భూకబ్జాకు సూత్రదారి
# మంత్రేనా..?

### ఉప్పర్పల్లిలో కబ్జాకు గురవుతున్న పేదల భూములు
### మల్లారెడ్డియే అంటున్న స్థానికులు
### పేదలంటే మంత్రికి ఎందుకింత చులకన అంటూ నిలదీత
### టీడీపీ ప్రభుత్వంలో ఇదే భూమిలో పేదలకు పట్టాలు
### తమ భూముల జోలికొస్తే ఖబర్దార్



**మేడ్చల్, - విశాల భారతి :**
ప్రభుత్వ, వంకపోరంబోకు భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఫలితంగా ఎకరాలకు ఎకరాల ప్రభుత్వ భూములు కనుమరుగవుతున్నాయి. రెక్కాడితే డొక్కాడని కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాల్సింది పోయి.. ప్రభుత్వమే వారి భూముల్లో పాగా వేస్తూ తీవ్రంగా ఇబ్బందుల పాలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఎటువైపు వెళ్తోంది.. ఎవరికోసం ఈ పాలన.. చేస్తున్నారని ఉప్పరపల్లి గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ నాయకులు స్వార్థానికి పోయి కోట్లు గడించాలని ఆశ కొద్ది ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను సైతం దోచుకునేందుకు యత్నిస్తున్నారని వాపోతున్నారు. తెలంగాణ ప్రభుత్వం భూదోపిడీ, అరాచకపు పాలనకు కేరాఫ్ అడ్రస్ మారిందని వారు విమర్శిస్తున్నారు. ఉప్పరపల్లి గ్రామస్తులను గత 22 ఏండ్లుగా ఎంతో ఇబ్బందుల పాలు చేస్తున్న ఈ తెలంగాణ ప్రభుత్వం అందులో మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన చామకూర మల్లారెడ్డి యే ఈ కబ్జాకు సూత్ర ధారుడుగా ఉన్నాడని వారు ఆరోపిస్తున్నారు.

**ముఖం చాటేసిన తహసీల్దార్**
ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందన్న విషయం తెలుసుకొని శామీర్పేట తహసీల్దార్సత్యనారాయణ అక్కడికి వచ్చారు. పర్యవేక్షించిన అనంతరం ఉప్పరపల్లి గ్రామస్తులు తహసీల్దార్ ను ఇది పేదల భూమి కాదా? సారూ.. అంటూ నిలదీయగా.. వారికి ఎలాంటి సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి ముఖం చాటేసి వెళ్లిపోయారు. దీంతో తహసీల్దార్, ప్రభుత్వం ఎవరికి వత్తాసు పలకడానికి ఇవన్నీ చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ భూముల జోలికొస్తే ఖబర్దార్అంటూ హెచ్చరిస్తున్నారు.

### గతంలో పేరు పెట్టుకోమన్నడు..
### ఇప్పుడు కబ్జా చేస్తుండు..

గ్రామస్తులు ఎంతో ఆగ్రహంతో ఉన్నారు గతంలో మంత్రి ఇంటి దగ్గరికి వెళ్లినప్పుడు ఆ ప్లాట్లు కచ్చితంగా ఉప్పరపల్లి గ్రామానికి చెందుతాయని, కాలనీకి తన పేరు పెట్టుకోమని చెప్పిన మంత్రి .. ఇప్పుడు రాత్రికి రాత్రి ఎవర్నో తీసుకొచ్చిపెట్టి గుడిసెలు వేయిస్తుంటే వారిని అడ్డుకునేందుకు వెళ్లిన గ్రామస్తులను ఎవ్వరిని కూడా అక్కడికి వెళ్ళనివ్వకుండా పోలీసులు బందోబస్తు పెట్టి అడ్డుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇప్పటికైనా మా పట్టాలు మాకు ఇస్తేనే నువ్వు ఉప్పరపల్లిలోకి అడుగు పెట్టేది. లేకుంటే ఉప్పరపల్లిలోకి అడుగు పెట్టించే ప్రసక్తే లేదు నీవు కాకపోయినా సరే మనం గ్రామస్తులం ఏకమై పోరాడి మా పట్టాలను మేము సాధించుకునే వరకు ఊరుకునే ప్రసక్తే లేదు 'అని గ్రామస్తులు ముక్తకంఠంతో చెప్తున్నారు.

## 'తుమ్మల' చేరికకు
# డేట్ ఫిక్స్!

## ఈ వారంలో హస్తం గూటికి..



- నేడో.. రేపో ఢిల్లీకి పయనం..
- జాతీయ నేతల సమక్షంలో చేరిక
- పాలేరు టికెట్‌కు కాంగ్రెస్ హామీ
- షర్మిల పోటీపై ఉత్కంఠ

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** ఎన్నికలకు ముందు ఖమ్మం రాజకీయాలు హీటెక్కాయి. పాలేరు అసెంబ్లీ టికెట్ దక్కకపోవడంతో బీఆర్ఎస్‌కు దూరంగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు హస్తం గూటికి చేరేందుకు ముహూర్తం ఖరారైంది. గత ఎన్నికల్లో పాలేరు నుంచి ఓడిపోయిన తుమ్మలకు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి టికెట్ దక్కలేదు. పాలేరు నుంచి తుమ్మలపై గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి ఆ తర్వాత అధికార పార్టీలో చేరారు. ఇటీవల బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థుల్లో ఉపేందర్‌రెడ్డి పేరునే సీఎం కేసీఆర్ ఖరారు చేశారు. దాంతో అసంతృప్తితో ఉన్న తుమ్మల రాజకీయ భవిష్యత్ ప్రస్తుతం ప్రశ్నార్థకమైంది.
టికెట్ దక్కక పోవడంతో అసంతృప్తితో ఉన్న తుమ్మలను బుజ్జగించేందుకు హైకమాండ్ ప్రయత్నాలు ఫలించలేదు. ఆయన పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తుమ్మల ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానించారు. ఆ తర్వాత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భట్టి విక్రమార్క కూడా భేటీ కావడంతో.. తుమ్మల కాంగ్రెస్ చేరడం దాదాపు ఖరారైంది. ఆయన అభిమానులు కూడా ఎమ్మెల్యేగా పోటీ చేయాలని కోరడంతో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.

**వచ్చే వారంలో జాయినింగ్..**
తుమ్మల నాగేశ్వరరావు ఇంటికి కాంగ్రెస్ నేతలు క్యూ కట్టడంతో ఆయన పార్టీలో చేరే అంశం కొలిక్కి వచ్చింది. నేడో రేపో ఆయన ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ జాతీయ నేతల సమక్షంలో చేరుతారని తెలుస్తోంది. ఈనెల 6వ తేదీన తుమ్మల ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున్ ఖర్గే, ఎంపీ రాహుల్ గాంధీ సమక్షంలో హస్తం పార్టీలో చేరుతున్నారని సమాచారం. ఇక, రాహుల్ గాంధీ ఈనెల 7 నుంచి యూరప్ పర్యటనకు సిద్ధం కానున్నారు. ఆ పర్యటనకు ముందే 6వ తేదీన ఢిల్లీలో రాహుల్ గాంధీ సమక్షంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నారు. తుమ్మల సహా ఆయన ముఖ్య అనుచరులు ఢిల్లీకి వెళ్లేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయని పార్టీ వర్గాల నుంచి సమాచారం.

**పాలేరు నుంచి బరిలోకి..**
ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గ స్థానం కీలకంగా మారింది. వచ్చే ఎన్నికల్లో పాలేరు నుంచి పోటీ చేయాలని అనుకున్న ఆయనకు బీఆర్ఎస్ బ్రేక్‌లు వేసింది. దాంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చినా అది కుదరలేదు. ఎలగైన పాలేరు నుంచి పోటీ చేయాలని 'తుమ్మల' కంకణం కట్టుకున్నారు. ఆయనను కలిసిన కాంగ్రెస్ నేతలు కూడా పాలేరు టికెట్ ఇస్తామనే హామీ తన ముందు పెట్టినట్లు తెలుస్తోంది. అంతేకాక పొంగులేటి, తుమ్మలకు ఖమ్మంలో మంచి అనుభవం ఉండగా.. ఎట్టిపరిస్థితుల్లో ఖమ్మం కంచుకోటను వదులుకోకూడదని కాంగ్రెస్ భావిస్తోంది. అందుకే బలమైన నేతలను ఒకే గూటికి చేర్చి విజయం అందుకోవాలని భావిస్తోంది. ఇక షర్మిల కూడా పాలేరు టికెట్ ఆశించగా.. తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తే అమెకు ఇచ్చే సీటుపై కాంగ్రెస్‌లో చర్చ మొదలైంది.